మహనీయుల అడుగుజాడల్లో నడుద్దాం

- మంత్రి ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి
- వాడవాడలా ఘనంగా గణతంత్ర దినోత్సవం



శెట్టూరు: లక్ష్మంపల్లి వద్ద అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్



రాయదుర్గంటౌన్: మున్సిపల్ కార్యాలయంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

సాక్షి బృందం: రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో గురువారం గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గురువారం శెట్టూరు మండలంలోని లక్ష్మంపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి మంత్రి ఉషశ్రీచరణ్ నివాళులర్పించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ సేవలను మంత్రి స్మరించుకున్నారు. అనంతరం ఆమె గ్రామంలోని వివాహ కార్యక్రమానికి హాజరై వధూవరులు చెప్మి, సయ్యద్ ఖలీల్‌ను ఆశ్వీరదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ సోమనాథ రెడ్డి, సర్పంచ్ చిట్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలి

ప్రతి పౌరుడూ ప్రాథమిక హక్కులకు లోబడి, ఇతర హక్కులను హరించకుండా రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. రాయదుర్గం పట్టణంలో గురువారం గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం, 7వ సచివాలయం, ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన వేడుకలకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. అంతకుముందు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ దివాకర్‌రెడ్డి జెండా ఆవిష్కరించారు. ప్రభుత్వ విప్ మాట్లాడుతూ దేశ సమగ్రత, పరిరక్షణకు ప్రతిఒక్కరూ కంకణబద్ధులు కావాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మాధవరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ వలిబాషా, కౌన్సిలర్లు వార్డు ఇన్‌చార్జ్‌లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. అలాగే జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయ సేవా అధికార సంస్థ చైర్‌పర్సన్, జడ్జి లావణ్య ఆధ్వర్యంలో గురువారం గణతంత్ర దినోత్సవం నిర్వహించారు. అనంతరం కేజీబీవీ, బీజీ తిలక్ మున్సిపల్ బాలికల హైస్కూల్ విద్యార్థులచే నిర్వహించిన డ్యాన్స్ పోటీలు అలరించాయి. రాయదుర్గం పట్టణంలోని బళ్లారి రోడ్డు వద్ద ఉన్న జామియా అన్వారుల్‌ఉలూమ్ మదరసా, కణేకల్లు రోడ్డు నందు గల జామీయ మొహమ్మదీయ అరబిక్ కళాశాల్లో గురువారం రిపబ్లిక్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. మార్కెట్ యార్డులో చైర్మన్ బోజరాజ్‌నాయక్, వైస్ చైర్మెన్ మేకల శ్రీనివాసుల ఆధ్వర్యంలో కార్యదర్శి సునీత జెండాకు వందన సమర్పణ చేశారు. అలాగే రాయదుర్గం నియోజకవర్గంలోని రాయదుర్గం, కణేకల్లు, బొమ్మనహాళ్, గుమ్మఘట్ట, డీ హీరేహాళ్ మండలాలు, కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కళ్యాణదుర్గం, కంబదూరు, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కుందుర్పి, ఉరవకొండ నియోజకవర్గంలోని ఉరవకొండ, కూడేరు, విడపనకల్లు, బెళుగుప్ప, వజ్రకరూరు మండలాల్లో గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో జాతీయ జెండా రెపరెపలాడింది. చిన్నారుల స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణ ఆకట్టుకుంది. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



రాయదుర్గంటౌన్: చిన్నారులతో కలిసి గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న జడ్జి లావణ్య



కళ్యాణదుర్గం: రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి



ఉరవకొండ: గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పంచాయతీ పాలకవర్గ సభ్యులు, నాయకులు



ఉరవకొండ: గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న ఉరవకొండ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఓంకార్

క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

శెట్టూరు: మండలంలోని పెరుగుపాళ్యంలో శుక్రవారం మంత్రి ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ లక్ష్మీదేవి, జెడ్పీటీసీ సభ్యుడు మంజునాథ గురువారం తెలిపారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు హాజరు కావాలన్నారు.

కేజీబీవీ బాలికల ప్రతిభ



కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న బాలికలు, ఎస్‌ఓ

కూడేరు: అనంతపురంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో గురువారం 74వ గణంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడేరు కేజీబీవీకి చెందిన బాలికలు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదుగా కేజీబీవీ ఎస్‌ఓ ఉమాదేవి, పీఈటీ అంజనాబాయి, బాలికలు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

నివాళి



భీమక్క మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న విప్ కాపు

కణేకల్లు: వైఎస్సార్‌సీపీ నాయకుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మారెంపల్లి మారెన్న తల్లి భీమక్క గురువారం వేకువజామున మృతిచెందారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ రైతు విభాగం కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు డి.పద్మావతి, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి తదితరులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాడె మోసి వెళ్లి అంత్యక్రియలు పూర్తయ్యేదాకా విప్ అక్కడే ఉన్నారు.

మైలారంపల్లి నాగన్నకు..



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: మండలంలోని మైలారంపల్లికి చెందిన కమ్యూనిస్టు నాయకుడు నాగన్న అనంతపురంలోని ఆయన స్వగృహంలో అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, ఆయన సోదరుడు వైస్ ఎంపీపీ శ్రీనాథ్‌రెడ్డి తదితరులు నాగన్న మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈసందర్భంగా నాగన్నతో తనకున్న సాన్నిహిత్యాన్ని విశ్వేశ్వరరెడ్డి గుర్తుచేసుకున్నారు.

కనులపండువగా పల్లకీ ఉత్సవం



అలంకరణలో షిరిడీసాయినాథుడు

వజ్రకరూరు: స్థానిక షిరిడీసాయి ఆలయంలో గురువారం పల్లకీ ఉత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామికి క్షీరాభిషేకం, మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం మధ్యాహ్న హారతి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం పల్లకీ ఉత్సవం చేపట్టారు. రాత్రి శేజ్ హారతి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు అనంతస్వామి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వసంత పంచమి

అనంతపురం కల్చరల్: నగరంలోని పలు ఆలయాల్లో వసంత పంచమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో ఉదయం అమ్మవారికి అభిషేక, అలంకార సేవలు జరిగాయి. అలాగే నగర శివారులోని శృంగేరీ శారదా శంకర మఠంలో వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. స్థానిక రెండవ రోడ్డు శారదా సమాజంలోని పురాతన సరస్వతీమాత మందిరంలో సరస్వతీమాతకు పూజలు చేశారు.

వైభవంగా శివలింగాల ప్రతిష్ట



రామలింగేశ్వర దేవస్థానంలో ప్రతిష్టించిన 108 శివలింగాలు

బొమ్మనహాళ్: మండలంలోని చంద్రగిరి రామలింగేశ్వర దేవస్థాన ఆలయంలో 108 శివలింగాలను గురువారం వైభవంగా ప్రతిష్ఠించారు. వేదపండితులు రెండు రోజుల నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి గురువారం ఉదయం 108 శివలింగాలు, కలశాలు, నంది విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సంస్థాన కల్‌హోళ మఠం, పాల్తూరు, మ్యాళిగనూరుకు చెందిన చన్నవీర శివాచార్య స్వాములు, బళ్లారికి చెందిన పంపాపతి శాస్త్రి, ఆలూరు తాలుకా, కొక్కరచేడు గ్రామానికి చెందిన శివశరణమ్మ, పండీపురానికి చెందిన చైతన్య సద్గురు గోపాల్ మహారాజులు, బళ్లారికి చెందిన మహాంతేశ మూర్తి హాజరయ్యారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వందలాది భక్తులు ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఉత్తమ అంగన్‌వాడీ వర్కర్‌గా హేమలత

గుమ్మఘట్ట: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు సక్రమంగా పౌష్టికాహారం అందించడంతో పాటు ఉత్తమ సేవలందించడంతో ఉత్తమ అంగన్‌వాడీ వర్కర్‌గా హేమలత ఎంపికైనట్లు సూపర్‌వైజర్ అంజినమ్మ తెలిపారు. మండలంలోని గొడ్లయ్యదొడ్డి గ్రామం అంగన్‌వాడీ వర్కర్ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకోవడంతో తోటి సిబ్బంది, ఆయాలు అభినందించారు.

జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందాం



శెట్టూరు: సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్

శెట్టూరు: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించిన జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అన్నారు. గురువారం మండలంలోని రామ్‌నగర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. 74 ఏళ్ల గణతంత్ర భారతంలో పేదలకు రాజ్యాంగ ఫలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సొంతమన్నారు. రాజ్యాంగ స్ఫూర్తితో మహిళా రిజర్వేషన్లు, మహిళా చట్టాలు, పేదలకు సంక్షేమ పథకాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లు ఏర్పాటు చేశారన్నారు. అందరికీ అందుబాటులో విద్య, వైద్యం, జగనన్న వల్ల సాధ్యమైందన్నారు. వచ్చే ఎన్నికల్లో సంక్షేమానికి, అభివృద్ధికి ప్రజలు పట్టం కడతారని, ప్రతి పక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా జనం వారికి తగిన బుద్ధి చెప్తారని మంత్రి అన్నారు. కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ తీన్మార్ తిమ్మరాజు, వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ సోమనాథ రెడ్డి, సర్పంచ్ పాలయ్య, కోఆప్షన్ మెంబర్ మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా లక్ష్మీవేంకటేశ్వరస్వామి రథోత్సవం



కుందుర్పి: రథోత్సవంలో పాల్గొన్న మంత్రి

కుందుర్పి: లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవం నేత్రపర్వంగా సాగింది.ఉదయం హోమం మధ్యాహ్నం 12–30 గంటలకు బ్రహ్మరథోత్సవం సందర్భంగా మంత్రి ఉషశ్రీచరణ్, ఆలయ ధర్మకర్త సత్యనారాయణశాస్త్రి, ఎంపీపీ కమలమ్మ, సర్పంచ్ మారుతేశ్వరి తదితరులు రథాన్ని లాగి ఉత్సవాన్ని ప్రారంభించారు.అంతకు ముందు మంత్రి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. సాయంత్రం గ్రామోత్సం, రాత్రి 10గంటలకు ధూళోత్సవం సందర్భంగా బ్రహ్మరథాన్ని భక్తుల సాయంతో ఆలయం నుంచి జెమ్మిచెట్టు వరకు రథాన్ని ఊరేగించారు. దారిపొడువునా భక్తులు తమలపాకులు, అరటి పళ్లు రథం వేసి మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం పానకం బండ్ల ఊరేగింపు, శనివారం ధ్వజావరోహణం సందర్భంగా ఉట్లమాను ఎక్కే కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయి. కళ్యాణదుర్గం రూరల్ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కృష్ణమూర్తి బందోభస్తు ఏర్పాటు చేశారు. కార్యమంలో వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ పాలాక్షి, వైస్ ఎంపీపీ శ్రీలక్ష్మి, ఎంపీటీసీ గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణోత్సవం



స్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, భారతి దంపతులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో వేణుగోపాలస్వామి, రుక్మిణి, సత్యభామదేవరుల 11వ వార్షికోత్సవ కల్యాణోత్సవం గురువారం కనులపండువగా సాగింది. కల్యాణోత్సవంలో భాగంగా ఉదయం ఆలయంలో ఫలపంచామృతాభిషేకం, దేవేరులతో శ్రీకృష్ణ పరబ్రహ్మని నిశ్చయ తాంబూలం, మహామంగళ హారతి నిర్వహించారు. సాయంత్రం 7 గంటల నుంచి శ్రీవారి కల్యాణోత్సవాన్ని రామ్మూర్తిస్వామీజీ, వేదపండితులు, ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో చేపట్టారు. డోలోత్సవం, శయనోత్సవ కార్యక్రమాలకు భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ, భక్త మండలి ఆధ్వర్యంలో సౌకర్యాలు కల్పించారు. కాగా కల్యాణోత్సవానికి ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, భారతి దంపతులు గురువారం సాయంత్రం హాజరై మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాసయాదవ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు మేకల శ్రీనివాసులు, కౌన్సిలర్ డిష్ గోవిందు, మెప్మా పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు పార్వతి, స్వామి అర్చనానంద తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఇంటెలిజెన్స్ హెడ్ కానిస్టేబుల్‌గా ప్రసాద్



డీజీ చేతుల మీదుగా అవార్డు తీసుకుంటున్న హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్

ఉరవకొండ: నియోజకవర్గ ఇంటిలిజెన్స్ శాఖలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వెంకటప్రసాద్ ఉత్తమ కానిస్టేబుల్‌గా గురువారం విజయవాడలోని ఇంటిలిజెన్స్ శాఖ ప్రధాన కార్యాలయంలో పురస్కారాన్ని అందుకున్నారు. ఇంటిలిజెన్స్ శాఖ డీజీ సీతారామాంజనేయులు, ఎస్పీ సత్యయేసు బాబు అవార్డును అందజేశారు. అతడిని సహచరులు అభినందించారు.

మహిళలను వేధిస్తున్నాడంటూ కరపత్రాలు



ఆవులెన్న గ్రామంలో సర్పంచ్ రామ్‌మోహన్ చౌదరిపై గోడలకు అతికించిన కరపత్రం

బెళుగుప్ప: మండల పరిధిలోని ఆవులెన్న గ్రామానికి చెందిన టీడీపీ మద్దతు సర్పంచ్ రామ్‌మోహన్ చౌదరి ఆడవాళ్లపై లైంగికంగా వేధిస్తున్నాడంటూ కరపత్రాలు వెలిశాయి. మండలంలోని ఆవులెన్న, బెళుగుప్ప, తగ్గుపర్తి తదితర గ్రామాల్లో గోడలకు గుర్తు తెలియని వ్యక్తులు ఈ కరపత్రాలను అతికించారు. సర్పంచ్‌గా ఉంటూ ఎస్సీ, బీసీల సంసారాలను కూలుస్తున్నాడని, డబ్బుతో మహిళలను లొంగదీసుకుంటున్నాడని పలుమార్లు హెచ్చరించినా పద్ధతి మార్చుకోలేదని సర్పంచ్ ఫోటోతో వున్న కరపత్రాలు హల్‌చల్ చేశాయి. ఘటనపై సర్పంచ్‌ను వివరణ కోరగా రాజకీయంగా ఎదుగుతున్న తనను ఓర్వలేక గిట్టనివారు ఇలాంటి నీచరాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు.

పప్పుశనగ పంట కోతలు ప్రారంభం



వజ్రకరూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో పప్పుశనగ పంట కోతలు ప్రారంభమయ్యాయి. 2022 రబీ సీజన్‌లో రైతులు పప్పుశనగ పంటతోపాటు పొద్దుతిరుగుడు పంటను సాగు చేశారు. మండల వ్యాప్తంగా పప్పుశనగ పంట 14,500 ఎకరాల్లో సాగు చేసినట్లు వ్యవసాయఅధికారులు వెల్లడించారు. పప్పుశనగ పంట కాలం ముగింపు దశకు చేరుకోవడంతో అన్నదాతలు పంట కోతలు ప్రారంభించారు. కొందరు రైతులు పప్పుశనగ పంట కోతను యంత్రాల ద్వారాప్రారంభించగా, మరికొందరు కూలీల చేత చేస్తున్నారు. మరో 15 రోజులపాటు రైతులు పప్పుశనగ పంట కోతల్లో బీజీగా ఉండనున్నారు.

అంగన్‌వాడీ కేంద్ర భవనానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న దృశ్యం

కంబదూరు: మండలంలోని మరిమాకులపల్లిలో నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి గురువారం సర్పంచ్ బాపూజీ భూమిపూజ చేశారు. భవన నిర్మాణానికి సంబంధించి రూ.16 లక్షలు మంజూరైనట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ, సచివాలయ కార్యదర్శి చంద్రశేఖర్, వైస్ ఉపసర్పంచ్ హుసేన్‌పీరా, సచివాలయ కన్వీనర్లు రవీంద్ర, మూర్తి, నాయకులు మారెన్న, గిరి, శంకరప్ప, మృత్యుంజయ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి లక్ష్మీదేవమ్మకు నివాళులు



మాజీ మంత్రి లక్ష్మీదేవమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్, పార్టీ నాయకులు

కళ్యాణదుర్గం: సీడబ్ల్యూసీ సభ్యురాలు, మాజీ మంత్రి లక్ష్మీదేవమ్మ విగ్రహానికి రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్, పార్టీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళ్యాణదుర్గంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు విస్తరణలో భాగంగా విగ్రహాన్ని తొలగించారు. తిరిగి గురువారం అనంతపురం ప్రధాన రహదారిలో పునఃప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా మంత్రి నాయకులతో 'జోహార్ లక్ష్మీదేవమ్మ...అంటూ నినాదాలు చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, జెడ్పీటీసీలు బొమ్మన్న, గుద్దెళ్ల నాగరాజు, ఎంపీపీ మారుతమ్మ, నాయకులు తిరుమల వెంకటేశులు, నరేంద్రరెడ్డి, కళ్యాణదుర్గం అర్బన్, రూరల్ సచివాలయ కన్వీనర్లు అర్చన, ఆంజనేయులు, వక్ఫ్‌బోర్డు సభ్యుడు షేక్షావలి, కౌన్సిలర్ పరమేశ్వరప్ప, నాయకులు జోసెఫ్ కిశోర్, రామాంజినేయులు, నల్లప్ప, గోవిందప్ప, విజయ్, చల్లా కిశోర్, గాజుల అంజి, నటరాజ్ పాల్గొన్నారు. అలాగే మాజీ మంత్రి లక్ష్మీదేవమ్మ కోడలు చందనా శివాజీ, విజయ్‌కుమార్, నాయకులు రఘునాథ్‌రెడ్డి, న్యాయవాది కరణం తిప్పేస్వామి తదితరులు నివాళులర్పించారు.



కళ్యాణదుర్గం: అనంతపురంలోని పోలీస్ పరేడ్ మైదానంలో కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న డీఎస్పీ బి.శ్రీనివాసులు



కళ్యాణదుర్గం: ఏపీఎంఐపీ ఎంఐఓ చిన్న మల్లేశు



శెట్టూరు: మహిళా పోలీస్ బేబి



కూడేరు: కొర్రకోడు పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ రెడ్డి



గుమ్మఘట్ట: ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్



కణేకల్లు: ఈఓ ప్రసాద్

ఉత్తమ సేవలకు పురస్కారం

సాక్షి నెట్‌వర్క్: ప్రభుత్వ కార్యక్రమాల అమలు, పారదర్శకత, జవాబుదారీతనంతో పనిచేస్తున్న అధికారులకు ఉత్తమ పురస్కారం దక్కింది. గురువారం జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్ చేతులకు మీదుగా వారు ప్రశంసా పత్రం అందుకున్నారు. వారిని సహచర ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, నాయకులు అభినందించారు.